

ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 28-12-2025 | సంపుటి - 26 | సంచిక -220 | రూ : 4 | పేజీలు: 8

# కెనడాలో ఆపదలో ఉన్న భారతీయ మహిళల కోసం 24 గంటల హెల్ప్‌లైన్

- 'వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్' పేరుతో ప్రత్యేక సహాయ కేంద్రం
- మహిళలకు సకాలంలో తోడుగా నిలిచే లక్ష్యంతో హెల్ప్‌లైన్ ఏర్పాటు
- కెనడా చట్టాలకు లోబడి వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్ ఏర్పాటు

2లో






2లో

# తెలంగాణలో మహిళలకు 'కామన్ మొబిలిటీ కార్డు'..

- మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల జారీ
- ఒకే కార్డుతో బస్సు, మెట్రో, ఎంఎంటీఎస్ సేవలు
- ప్రయాణికుల డేటాతో ఆర్టీసీ రూట్ల క్రమబద్ధీకరణ
- భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు అనుసంధానం



2లో

# భయం వీడింది.. పహల్గామ్‌లో న్యూ ఇయర్ సందడి..

- ఉగ్రదాడి తర్వాత పహల్గామ్‌లో మళ్లీ పర్యాటకుల సందడి
- కొత్త సంవత్సర వేడుకల కోసం కశ్మీర్‌కు తరలివస్తున్న జనం
- భద్రతా ఏర్పాట్లు బాగున్నాయని పర్యాటకుల సంతృప్తి
- ఏప్రిల్‌లో జరిగిన దాడితో కుదేలైన పర్యాటక రంగం

# మొబైల్ తయారీలో భారత్ దూకుడు..

## ప్రపంచంలోనే రెండో స్థానం!

- ప్రపంచంలో రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ అవతరణ
- గత 11 ఏళ్లలో ఆరు రెట్లు పెరిగిన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి
- ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంతో భారీగా పెరిగిన పెట్టుబడులు, ఉపాధి
- గత దశాబ్దంలో ఎలక్ట్రానిక్స్ రంగంలో 25 లక్షల ఉద్యోగాల కల్పన



2లో



2లో

# మారేడుమిల్లికి వెళ్లే పర్యాటకులకు పోలీసుల హెచ్చరిక

- మందు పాతరలను గుర్తించిన భద్రతాబలగాలు
- కొనసాగుతున్న మందు పాతరలను వెలికి తీసే కార్యక్రమం
- పని పూర్తయ్యేంత వరకు ఆ ప్రాంతాలకు వెళ్లొద్దని పోలీసుల హెచ్చరిక



2లో

# ఎన్టీఆర్ కు మేమిచ్చే నివాళి ఇదే

- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ట్రస్ట్ సేవలందిస్తోందన్న భువనేశ్వరి
- పేదలు, అనాథలకు ఉచిత విద్య, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని వెల్లడి
- హెల్త్ కేర్, సివిల్స్ అకాడెమీ ద్వారా యువతకు చేయూత
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామని వివరణ

# పాలిటెక్నిక్‌కు సీఎస్ఆర్ హంగులు

- మూడేళ్లలో రూ.9.38 కోట్ల నిధులతో వసతుల కల్పన
- రూ.2.02 కోట్ల సేకరణతో అగ్రస్థానంలో జోగిపేట కళాశాల

2లో



# ఎన్టీఆర్ కు మేమిచ్చే నివాళి ఇదే: నారా భువనేశ్వరి

తన తండ్రి దివంగత ఎన్టీ రామారావు స్ఫూర్తితో, ఆయన చూపిన బాటలోనే ఎన్టీఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే ఎన్టీఆర్ సిద్ధాంతానికి అనుగుణంగానే ట్రస్ట్ పనిచేస్తోందని ఆమె స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గండిపేటలో జరిగిన ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజంలోని పేద వర్గాలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని చెప్పారు. "పేద, అనాథ పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నాం. సివిల్ సర్వీసెస్ అకాడెమీ ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నాం. హెల్త్ కేర్, తలసేమియా సెంటర్, ఎన్టీఆర్ సంజీవని క్లినిక్కుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం" అని వివరించారు. అంతేకాకుండా, 'స్త్రీశక్తి' ద్వారా పేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, 'ఎన్టీఆర్ సుజల' పథకం ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. పేదల జీవితాలను మెరుగుపరచడం, కుటుంబాలను ఆదుకోవడమే ఎన్టీఆర్‌కు తామిచ్చే నిజమైన నివాళి అని భువనేశ్వరి పేర్కొన్నారు. బాహ్య ప్రపంచంలోని సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు ఇక్కడి నుంచే సంసిద్ధులు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

**స్ఫూర్తినిచ్చారు... కెరీర్ తీర్చిదిద్దారు!**

ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవంలో ఆ సంస్థలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పలువురు ప్రసంగించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పించి... చక్కటి భవిష్యత్తు కల్పించిన సీఎం చంద్రబాబు దంపతులకు పూర్వ విద్యార్థి హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తాను సినాప్సిస్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్టు హరికృష్ణ వెల్లడించారు. అలాగే ఎన్టీఆర్ విద్యా సంస్థలే తన కెరీర్ ను తీర్చిదిద్దాయని మరో పూర్వ విద్యార్థిని ఉమ శ్రీ చెప్పారు. ఎయిర్ హోస్టెస్ అయిన తాను ఎంటర్ ప్రెన్యూయర్ గా కొనసాగుతున్నట్టు ఉమ శ్రీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ విద్యా సంస్థల యాన్యువల్ రిపోర్టులను స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్స్ జోజి రెడ్డి, రామారావు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మహిళలకు 'కామన్ మొబిలిటీ కార్డు'..

తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'మహాలక్ష్మి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ప్రత్యేకంగా 'కామన్ మొబిలిటీ కార్డు'లను జారీ చేయనుంది. ప్రస్తుతం ఆధార్ కార్డుతో ప్రయాణిస్తున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ స్మార్ట్ కార్డుల విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీని రూపకల్పన కోసం ప్రభుత్వం ఇప్పటికే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)తో ఒప్పందం చేసుకుంది. గతేడాది ప్రారంభమైన మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు సుమారు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. దీనికోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 8,500 కోట్లు చెల్లించింది. అయితే, ప్రయాణ సమయంలో ఆధార్ కార్డు చూపించడం వల్ల కండక్టర్లు, ప్రయాణికుల మధ్య తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఆధార్‌పై ఫొటోలు స్పష్టంగా లేకపోవడం, నకిలీ కార్డుల వినియోగం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఈ స్మార్ట్ కార్డు కేవలం బస్ పాస్ మాత్రమే కాదు, బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడనుంది. మహిళలు బస్సుల్లో ఈ కార్డును ట్యాప్ చేసి ఉచితంగా ప్రయాణించవచ్చు. అంతేకాకుండా ఇందులో డబ్బులు లోడ్ చేసుకుని మెట్రో రైలు, ఎంఎంటీఎస్ వంటి ఇతర రవాణా సేవలను కూడా వినియోగించుకోవచ్చు. దీనివల్ల ప్రయాణికులు ప్రతిసారీ ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ కార్డుల జారీతో ప్రభుత్వానికి ప్రయాణికుల డేటా కచ్చితంగా అందుబాటులోకి వస్తుంది. ఏయే మార్గాల్లో మహిళల రద్దీ ఎక్కువగా ఉందో గుర్తించి, దానికి అనుగుణంగా బస్సు సర్వీసులను సర్దుబాటు చేసే అవకాశం కలుగుతుంది. దీనివల్ల ఆర్టీసీకి నష్టాలు తగ్గడమే కాకుండా, రవాణా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. భవిష్యత్తులో రేషన్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రభుత్వ పథకాలను కూడా ఇదే కార్డుకు అనుసంధానించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముందుగా మహిళలతో ప్రారంభించి, దశలవారీగా రాష్ట్ర

## నన్ను చాలా మంది ఐఏఎస్ చేయమన్నారు: సీఎం

తనను చాలామంది ఐఏఎస్ అధికారి కావాలని సూచించారని, కానీ తాను ప్రజాసేవకే ప్రాధాన్యతనిచ్చి రాజకీయాల వైపు అడుగులు వేశానని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. యూనివర్సిటీ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచానని, అనతికాలంలోనే మంత్రిగా, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు నాలుగోసారి సీఎంగా సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు. హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిపై ఆయన ప్రశంసలు కురిపించారు. తాను రాజకీయాల్లో తీరిక లేకుండా ఉన్న సమయంలో, అయిష్టంగానే హెరిటేజ్ బాధ్యతలు స్వీకరించిన భువనేశ్వరి, తన పట్టుదలతో ఆ సంస్థను అద్భుతంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. "నేను ఇప్పటికీ కాగితం చూసి ప్రసంగిస్తుంటే, భువనేశ్వరి ట్యాబ్ చూసి మాట్లాడుతున్నారు. నేను టెక్నాలజీ గురించి చెబుతుంటాను, ఆమె టెక్నాలజీని ఆచరణలో పెట్టి వినియోగిస్తున్నారు. మామగారు ఎన్టీఆర్ మాదిరిగానే భువనేశ్వరికి పట్టుదల, మొండితనం ఉన్నాయి. ఏదైనా పని మొదలుపెడితే పూర్తిచేసే వరకు వదలరు" అని అన్నారు. భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా, ట్రస్టీగా బహుముఖ పాత్రలను సమర్థవంతంగా పోషిస్తున్నారని అభినందించారు. హెరిటేజ్ సంస్థను అద్భుతంగా నడిపిస్తున్నందుకు లండన్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్' సంస్థ భువనేశ్వరికి గోల్డెన్ పీకాక్ అవార్డుతో పాటు వ్యక్తిగత పురస్కారాన్ని కూడా అందించిందని గుర్తు చేశారు. అంతకుముందు, గండిపేట ప్రాంగణానికి విచ్చేసిన చంద్రబాబు దంపతులకు ఎన్టీఆర్ విద్యా సంస్థల విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. ప్రాంగణంలో కలియతిరుగుతూ పాత స్మృతులను నెమరువేసుకున్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ, చదువు ఎంత ముఖ్యమో, విలువలు అంతకంటే ముఖ్యమని విద్యార్థులకు హితవు పలికారు. "లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చు, అప్పుడు సంపద దానంతట అదే వస్తుంది" అని అన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన కార్యకర్తల పిల్లలకు ఈ విద్యా సంస్థల ద్వారా

## కెనడాలో ఆపదలో ఉన్న భారతీయ మహిళల కోసం 24 గంటల హెల్ప్‌లైన్

కెనడాలో ఆపదలో ఉన్న భారతీయ మహిళల కోసం టోరంటోలోని భారత కాన్సులేట్ 'వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్' పేరుతో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇది 24 గంటల పాటు అందుబాటులో ఉండే హెల్ప్‌లైన్‌ను కలిగి ఉంటుందని తెలిపింది. గృహ హింస, దాడి, కుటుంబ వివాదాలు, దోపిడీ, న్యాయపరమైన సవాళ్లు ఎదుర్కొంటున్న భారత పాస్‌పోర్టు కలిగిన మహిళలకు సత్వర సహాయం అందించడమే ఈ కేంద్రం ముఖ్య లక్ష్యం. 'వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్' ద్వారా బాధిత మహిళలకు తక్షణ కౌన్సిలింగ్, మానసిక, సామాజిక మద్దతు అందించడంతో పాటు, సంబంధిత విభాగాల సమన్వయంతో చట్టపరమైన సహాయం, సలహాలు అందిస్తామని కాన్సులేట్ పేర్కొంది. కెనడా చట్టాలకు లోబడి 'వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్' సహాయం అందిస్తుందని కార్యాలయ వర్గాలు తెలిపాయి. మహిళా అధికారి నేతృత్వంలో ఈ కేంద్రం నిర్వహించబడుతుందని, దీనికి సంబంధించిన వివరాలు కాన్సులేట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

## త్రైవాన్‌లో భారీ భూకంపం



తైపీ: తైవాన్‌లో శనివారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. ఈశాన్య తీర నగరమైన యిలాన్‌కు సుమారు 32 కి.మీ దూరంలో చోటుచేసుకున్న ఈ భూకంపం తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై 7గా నమోదైంది. భూప్రకంపనల కారణంగా రాజధాని తైపేలో పలు భవనాలు కూలిపోయాయని.. నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు జాతీయ అగ్నిమాపక సంస్థ తెలిపింది. బుధవారం 6.0 తీవ్రతతో వచ్చిన ప్రకంపనల అనంతరం ఈ వారంలో ఆ ద్వీపాన్ని తాకిన రెండో భారీ భూకంపం ఇది.

## మారేడుమిల్లికి వెళ్లే పర్యాటకులకు పోలీసుల హెచ్చరిక

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ప్రాంతంలోని అటవీ ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలో, అక్కడకు వెళ్లే పర్యాటకులకు పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. గత నెలలో మారేడుమిల్లి ప్రాంతంలో ఎన్‌కౌంటర్లు జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం జరిగిన కూంబింగ్ లో మారేడుమిల్లిలోని లోతట్టు ప్రాంతాల్లో కొన్ని ప్రెజర్ మైన్లు, ల్యాండ్ మైన్లు అమర్చినట్టు గుర్తించారు. భద్రతాదళాలను హతమార్చేందుకు మావోలు వీటిని అమర్చారు. ప్రస్తుతం కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలు... వీటిని వెలికితీసే పనిలో ఉన్నాయి. ఇప్పటికే కొన్ని మైన్లను వెలికి తీశాయి. మరోవైపు, మారేడుమిల్లి లోతట్టు ప్రాంతాలను జల్లెడపట్టి మిగిలిన మందు పాతరలను కూడా వెలికి తీసే చర్యలను కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మందు పాతరలను వెలికి తీసేంతవరకు పర్యాటకులు, ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరించారు.



### ట్రంప్‌జెలెన్‌స్కీ భేటీ వేళ..
## క్షిపణులతో విరుచుకుపడిన రష్యా

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడులు చేసింది. రాజధాని నగరం కీవ్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఉక్రెయిన్ ఇంధన, మిలిటరీ సదుపాయాలే లక్ష్యంగా ఈ దాడులు చేపట్టామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కీవ్ తమ దేశంలోని జనావాసాలపై చేసిన దాడులకు ప్రతీకారమని తెలిపింది. ఈ భారీ దాడిలో మొత్తం 500 డ్రోన్లు, 40 క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. 27 మంది గాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫ్లోరిడాలో ఆదివారం భేటీ కానున్న సంగతి తెలిసిందే శాంతి ఒప్పందానికి సంబంధించిన కొన్ని పత్రాలు పూర్తిగా సిద్ధమయ్యాయని, మరికొన్ని తుది దశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ఈ భేటీ నేపథ్యంలో క్షిపణులతో రష్యా విరుచుకుపడటం గమనార్హం.

## భయం వీడింది.. పహల్గామ్‌లో న్యూ ఇయర్ సందడి.. పోటెత్తుతున్న పర్యాటకులు

కొన్ని నెలల కిందట జరిగిన భయానక ఉగ్రదాడిని లెక్కచేయకుండా పర్యాటకులు జమ్మూ కశ్మీర్‌లోని సుందరమైన పహల్గామ్‌కు తరలివస్తున్నారు. కొత్త సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి ఇవాళ్టి నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు ఇక్కడికి చేరుకుంటున్నారు. దీంతో కశ్మీర్ లోయలో మళ్లీ పర్యాటక కళ సంతరించుకుంది. గత ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించడంతో కశ్మీర్‌లో పర్యాటక రంగం తీవ్రంగా దెబ్బతింది. వేలాది మంది పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకున్నారు. అయితే, ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో నగర జీవితానికి దూరంగా ప్రశాంతంగా గడపాలనుకునే వారు పహల్గామ్‌ను ఎంచుకుంటున్నారు. భద్రతా ఏర్పాట్లపై పర్యాటకులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హర్యానాకు చెందిన ఓ పర్యాటకురాలు మాట్లాడుతూ, "నేను నా భర్తతో కలిసి మొదటిసారి కశ్మీర్‌కు వచ్చాను. ఇది నిజంగా చాలా అందంగా ఉంది. ఇక్కడి భద్రతా ఏర్పాట్లు చాలా బాగున్నాయి. కొత్త సంవత్సరాన్ని ఇక్కడ జరుపుకోవడం సురక్షితంగా అనిపిస్తోంది" అని తెలిపారు. మరో పర్యాటకుడు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొత్త సంవత్సర వేడుకల కోసం కళాశాల విద్యార్థుల బృందం కూడా పహల్గామ్‌కు చేరుకుంది. "ఇప్పుడు పరిస్థితులు చాలా మెరుగుపడ్డాయి. ఇంతకుముందు శ్రీనగర్ వెళ్లాను, ఇప్పుడు పహల్గామ్‌లో ఉన్నాను. ఇంకా మంచు కురవనప్పటికీ రాబోయే రెండు మూడు రోజుల్లో కురుస్తుందని ఆశిస్తున్నాం. స్థానిక ప్రజలు చాలా సహాయం చేస్తున్నారు" అని ఓ విద్యార్థి చెప్పాడు. ఏప్రిల్‌లో జరిగిన దాడి తర్వాత ప్రభుత్వం అనేక పర్యాటక ప్రదేశాలను మూసివేసింది. దీనివల్ల హోటళ్లు, రెస్టారెంట్లు, టాక్సీ ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోయారు. పర్యాటక రంగంపై ఆధారపడిన వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాయి. దీనితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటకుల్లో భరోసా నింపేందుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం పెరుగుతున్న పర్యాటకుల రాక కశ్మీర్ పర్యాటక రంగం తిరిగి

## పాలిటెక్నిక్‌కు సీఎస్ఆర్ హంగులు

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద పెద్దమొత్తంలో నిధులు పొందుతున్నాయి. పూర్వ విద్యార్థుల నుంచీ నిధులు సమీకరిస్తున్నాయి. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారులు, ఆయా కళాశాలల విభాగాల అధిపతుల చొరవ కారణంగా గత మూడేళ్లలో ఏకంగా రూ.9.38 కోట్లు సేకరించాయి. ఈ నిధులతో కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. ఫలితంగా పలు కళాశాలల్లో సౌకర్యాలు మెరుగయ్యాయి. డ్యూయల్ డెస్కులు, వాటర్ ప్లాంట్లు, వాటర్ ప్యూరిఫయర్లు, కంప్యూటర్లు, ల్యాబ్‌లు, క్రీడా పరికరాలు సమకూరాయి. కొన్నిచోట్ల ప్రహరీలు, సీసీ రోడ్లు నిర్మించారు. సీఎస్ఆర్ ఇన్‌ఛార్జుల నియామకం... రాష్ట్రవ్యాప్తంగా 59 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. వీటిలో డిప్లొమాలు పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల్లో పలువురు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారి నుంచి తాము చదువుకున్న కళాశాలలకు విరాళాలు సేకరించాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారులు సూచించారు. దానికితోడు కళాశాలల సమీపంలో ఉన్న పరిశ్రమలు, కార్పొరేట్ కంపెనీల వారితో సమావేశమై సీఎస్ఆర్ నిధులపై చర్చించాలని నిర్దేశించారు. ఆయా కళాశాలల్లోని విభాగాల అధిపతులను సీఎస్ఆర్ ఇన్‌ఛార్జులుగా రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్‌బీటెట్) నియమించింది. ఈ ప్రక్రియ 202324 విద్యాసంవత్సరంలో ప్రారంభమైంది.

## మొబైల్ తయారీలో భారత్ దూకుడు... ప్రపంచంలోనే రెండో స్థానం!

ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ అవతరించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ప్రకటించారు. గత 11 ఏళ్లలో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, ఎగుమతులు ఏకంగా ఎనిమిది రెట్లు వృద్ధి చెందాయని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఈ అద్భుత ప్రగతికి చోదకశక్తిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. భారీస్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ కోసం ప్రవేశపెట్టిన పీఎల్ఐ పథకం ద్వారా ఇప్పటివరకు రూ. 13,475 కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలో సుమారు రూ. 9.8 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సాధ్యమైందని, ఇది తయారీ, ఉద్యోగ కల్పన, ఎగుమతులను గణనీయంగా పెంచిందని వివరించారు. కేవలం గత ఐదేళ్లలోనే ఈ రంగంలో 1.3 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన జరిగిందని ఆయన అన్నారు. ఒకప్పుడు ఏడో స్థానంలో ఉన్న ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు, ఇప్పుడు దేశంలో మూడో అతిపెద్ద ఎగుమతి కేటగిరీగా ఎదగడం 'మేక్ ఇన్ ఇండియా' విజయానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం తొలుత పూర్తయిన ఉత్పత్తులపై దృష్టి సారించినప్పటికీ, క్రమంగా విడిభాగాలు, ముడి పదార్థాలు, వాటిని తయారుచేసే యంత్రాల తయారీ సామర్థ్యాన్ని పెంచడంపై కూడా దృష్టి పెట్టిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం ప్రవేశపెట్టిన 'ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్'కు అద్భుత స్పందన లభించిందని చెప్పారు. ఈ పథకం కింద 249 దరఖాస్తులు రాగా, వాటి ద్వారా రూ. 1.15 లక్షల కోట్ల పెట్టుబడులు, రూ. 10.34 లక్షల కోట్ల ఉత్పత్తి, 1.42 లక్షల ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇదే అత్యధిక పెట్టుబడి నిబద్ధత అని, ఇది పరిశ్రమకు ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని సూచిస్తోందని ఆయన అన్నారు.

## బస్తీ లోని సమస్యలను
# పరిష్కరించే దిశగా పని చేస్తాం
**వెంకటేశ్వర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : వెంకటేశ్వర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులుగా శ్రీరాముల వెంకట్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆర్. చంద్ర మోహన్, కోశాధికారిగా ఇ. అరవింద్ , కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గౌరవ సలహాదారులు సంజీవ్ రెడ్డి, హరినాథ్, వెంకటస్వామి సాగర్, భీమ్ రావు చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ బస్తీ యొక్క సమస్యలన్నీ ప్రజా ప్రతినిధి , అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించే దిశగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ యాదవ్,సోములు, రామ్ చందర్, సోమయ్య, రాజేందర్, రవి చందర్,మురళి,యాదగిరి, రమేష్ చారి, అశోక్,శంకర్ సాగర్, శ్రీకాంత్, నరేష్, బాల సిద్ధులు, సాయిరాం,నర్సింహా, చంద్ర సాగర్,సోమేశ్, భవాని శంకర్, శ్రీకాంత్, శ్యామ్ రాజ్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య , రక్తదాన శిబిరానికి మంచి స్పందన



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి చింతల్ మెయిన్ రోడ్ లో రిచ్ టవర్స్ వద్ద శ్రీ వీర మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య , రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొని రక్తదాన శిబిర కార్యక్రమం లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం శ్రీ అయ్యప్ప స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా జీడిమెట్ల డివిజన్ పరిధి బ్యాంక్ కాలనీ లో సంతోష్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమం లో ఆయన పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## భారతదేశం
# సర్వమత సమ్మేళన దేశం
* **సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భారతదేశం సర్వమత సమ్మేళన దేశమని సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ అన్నారు. సూరారం డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్‌లో ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సందల్ గర్వీ కార్యక్రమానికి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ హిందూ-ముస్లింలు గంగా-జమునా తహజీబ్‌ను ప్రతిబింబిస్తూ అన్నదమ్ముల వలె ఐక్యతతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. మతాల మధ్య సౌహార్దం, పరస్పర గౌరవం కొనసాగినప్పుడే సమాజంలో శాంతి, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని, ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆసిఫ్ , అస్రా , రాణి , నాగేష్ , జన్దిన్ , రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఏడాది కాలంలో 326 మంది మావోయిస్టుల లొంగుబాటు

* **సుమారుగా 30 కోట్ల రూపాయల గంజాయి స్వాధీనం**
* **జిల్లా పోలీసుల వార్షిక నివేదిక-2025 ను విడుదల చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో పోలీసు అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేయడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో ముందంజలో ఉన్నారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు వార్షిక నివేదిక2025 సమావేశాన్ని ఏర్పాటు చేసారు.ముందుగా వార్షిక నివేదిక బుక్ లెట్ ను విడుదల చేశారు.అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే 9.65 శాతం నేరాల శాతం పెరిగిందని గత ఏడాది 5636 కేసులు నమోదు కాగా,ప్రస్తుత సంవత్సరం 2025లో 6180 కేసులు నమోదు కావడం జరిగిందని,దారి దోపిడీ 01, దోపిడీలు 05 ,దొంగతనాలు 307 కేసులు నమోదయ్యాయి. హత్యలు 23,మానభంగాలకు సంబంధించి ఏడాదిలో 83 కేసులు నమోదు కాగా వీటితో పాటు వరకట్న మరణాలు,డొమెస్టిక్ నేరాలు తగ్గుముఖం పట్టగా,గత సంవత్సరం ఎస్సీ , ఎస్టీ కేసులు 102 నమోదు కాగా,ఈ ఏడాది 122 నమోదయ్యాయని,పోక్సో కేసులు గత ఏడాదిలో 105 కేసులు నమోదు కాగా,ఈ ఏడాది 128 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 420 కేసులు నమోదు కాగా, ప్రస్తుతం కేవలం 384 కేసులు మాత్రమే నమోదు కావడం జరిగింది. దీనితో మొత్తం మీద 8.57 శాతం మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు.

**సుమారుగా రూ.28 కోట్ల 54 లక్షల విలువైన గంజాయి పట్టివేత**

జిల్లా పరిధిలో ఈ ఏడాదిలో 70 కేసుల్లో మొత్తం 221మందిని అరెస్టు చేయడంతో పాటు వీరిని నుండి కోట్ల విలువగల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోగా,ఇందులో 5707 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, సుమారుగా 22 కోట్ల రూపాయల గంజాయిని ఈ ఏడాది తగులబెట్టడం జరిగిందని తెలిపారు. చోరీలకు సంబంధించి ఏడాది మొత్తం 307 కేసులలో 3,75,10,691/ రూపాయల సొత్తును కోల్పోగా, 141 కేసులలోని 1,21,99,297/ రూపాయల సొత్తును రికవరీ చేయడంలో జిల్లా సీసీఎస్ పోలీసుల పాత్ర కీలకమన్నారు.లోక్ అదాలత్లో ఈ ఏడాది మొత్తం వివిధ రకాల 20,595 కేసులు పరిష్కృతమయ్యాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 15,347 కేసులు నమోదు.సైబర్ సైబర్ క్రైమ్ సంబంధించి 196 కేసులు నమోదు చేయబడ్డాయని ఎస్పీ తెలిపారు.జిల్లా పరిధిలో మొత్తం 1824 కేసులు పరిష్కారం కాగా ఇందులో 07 గురికి జీవిత ఖైదు,ఇద్దరికి 20 సంవత్సరాల జైలు శిక్ష,05 గురికి 10 సంవత్సరాలు,ముగ్గురికి 07 సంవత్సరాల శిక్షలు ఖరారు చేశారు. రాబోయే నూతన సంవత్సరంలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని,శాంతి భద్రతల పరిరక్షణే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.ముఖ్యంగా చిన్నపిల్లలపై జరిగే లైంగిక నేరాలు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాము.రోడ్డు ప్రమాదాల నివారించడం,స్థానికంగా గంజాయి సరఫరా,అక్రమంగా రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమములో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,ఇల్లందు డిఎస్పి చంద్ర భాను,కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొండరెడ్ల గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దాలి

* **పూసుకుంటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న కొండరెడ్ల కుటుంబాల్లో వెలుగులు నింపేలా ఐటీడీఏ ఆధ్వర్యంలో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులతో కలిసి అన్ని శాఖల సమన్వయంతో నెలవారీ మాస్టర్ ప్లాన్ రూపొందించి పూసుకుంట గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. శనివారం దమ్మపేట మండలం పూసుకుంట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, కొండరెడ్ల గిరిజన కుటుంబాలతో పాటు ఏళ్లుగా అక్కడే నివసిస్తున్న గుత్తికోయ కుటుంబాలకు కూడా విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. చేతివృత్తులు అంతరించకుండా ఐటీడీఏ ద్వారా చేయూత అందించాలన్నారు.

**కోట్ల నిధులకు సిద్ధం**

కొండరెడ్ల కుటుంబాల అభివృద్ధి కోసం అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా ఎన్ని కోట్లయినా నిధులు మంజూరు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో సబ్‌సెంటర్, అంగనవాడీ భవనం, పాఠశాల భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పిల్లలు తప్పనిసరిగా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, ఐదో తరగతి పై చదువుల కోసం గురుకుల పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. వ్యవసాయ భూముల వివరాలు, చిన్నారులకు హెల్త్ కార్డులు, జీవిత బీమా సౌకర్యం కల్పించడంతో పాటు మూడు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. జామాయిల్ చెట్లను తొలగించి పామాయిల్ తోటలు ఏర్పాటు చేసి, అంతర్‌పంటలతో ఆదాయం పెంచుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

**రోడ్లు, ఇళ్లు, కరెంటు**

ఏప్రిల్ నాటికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, సబ్‌సెంటర్, గ్రామపంచాయతీ భవనం, పామాయిల్ సాగు చేస్తున్న కుటుంబాలకు బోరు-సోలార్ విద్యుత్ సదుపాయం అందిస్తామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు రాని కుటుంబాలకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొండరెడ్ల గ్రామాలకు క్యాజ్‌వేలు, చెక్‌డ్యామ్‌లు, రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.30 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

**ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే కొండరెడ్ల కుటుంబాల అభివృద్ధికి అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించామని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. 237 కొండరెడ్ల కుటుంబాలకు వందశాతం ఇళ్లు అందించామని, అశ్వరావుపేట నియోజకవర్గంలో రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. పూసుకుంట గ్రామంలో 21 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, మిగతా గ్రామాల్లో ఏప్రిల్ నాటికి అందిస్తామని తెలిపారు.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

కొండరెడ్ల కుటుంబాలకు ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి మౌలిక అవసరాలను గుర్తించాలని, భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి గ్రామపంచాయతీల్లో ప్రదర్శించాలని అన్నారు. వ్యవసాయం తో పాటు హార్టికల్చర్, సెరికల్చర్, చిన్న పరిశ్రమలపై దృష్టి సారించాలని సూచించారు.

**ఐటీడీఏ పీవో బి. రాహుల్**

పూసుకుంట గ్రామాన్ని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో పలు సౌకర్యాలు కల్పించామని, పవర్ టిల్లర్లు, సోలార్ లైట్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందించామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణలు అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

**ప్రారంభోత్సవాలు – పంపిణీ**

ఈ సందర్భంగా 18 మంది కొండరెడ్ల రైతులకు 75 ఎకరాల్లో పామాయిల్ మొక్కలు నాటారు. జన్మన్ పథకం కింద రూ.1.05 కోట్ల విలువైన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు అర్హత పత్రాలు పంపిణీ చేసి శంకుస్థాపన చేశారు. కరెంటు మోటార్లు, తైవాన్ స్ప్రే మిషన్లు, ఫ్లోర్ మిల్స్, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు, ఐటీడీఏ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

* **మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సత్యనారాయణ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ వెంకటాద్రి హిల్స్ (హెచ్ ఏ ఎల్ కాలనీ) లోని శ్రీ సత్యనారాయణ స్వామి లక్ష్మీ దేవస్థానం 29వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఈ దేవాలయం చాలా ప్రసిద్ధి చెందినదని, ప్రజలందరూ సత్యనారాయణ స్వామి దయ వల్ల సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి, ఆలయ ధర్మకర్త గణేష్ సింగ్, సురేందర్ సింగ్, రాం నారాయణ, సుబ్బారాయుడు, వెంకట సుబ్బయ్య, యాదగిరి, రాజు పంతులు , ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాలనలో విఫలమై ప్రతిపక్షంపై విమర్శలు

**- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్**



ప్రజా స్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రతిపక్షమైన బిఆర్ఎస్ పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ తొలి సిఎం కేసీఆర్ పట్ల వాడుతున్న భాష విషయంలో తీవ్రంగా ఖండించారు. సిఎం కు తగ్గట్టు భాషను మార్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటకు రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇవ్వని రైతు బంధు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండలంలో మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ సర్పంచులను గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రాలో కాంగ్రెస్ పార్టీపైన చేస్తున్న ప్రజాస్వామ్య పోరాటాన్ని, సిరిసిల్ల నియోజకవర్గం అభివద్ధిని చూచి ఆదరించి, అభిమానించిన ప్రజలకు కతజ్ఞతలు తెలిపారు.

# సెలవుల ఎఫెక్ట్.. శ్రీశైలం మల్లన్న ఆలయానికి భారీ ఆదాయం

ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి ఆలయానికి వరుస సెలవుల ప్రభావంతో భారీగా ఆదాయం లభించింది. సెలవులు కావడంతో క్షేత్ర దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిన్న ఒక్కరోజే సుమారు 40 వేల మంది భక్తులు మల్లన్నను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీతో ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దర్శనాలు, మనమిత్ర సేవలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, ఆర్జిత సేవలు, కేశఖండనతో పాటు ఇతర సేవల ద్వారా నిన్న ఒక్కరోజే ఆలయానికి రూ.1 కోటి 46 లక్షల 94 వేల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

# వైభవంగా సాయిమల అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి , కాప్రా : కాప్రా డివిజన్ సాయిబాబనగర్ కాలనీ లోని సాయిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మాన్ రేగళ్ల సతీష్ రెడ్డి గురుస్వామి అధ్వర్యంలో ఉదయం నాలుగు గంటలకు గణపతి హోమం, అభిషేకం, కలషాభిషేకం, ఉరేగింపు, వుష్పర్చణ, మహపడిపూజ వంటి కార్యక్రమాలను పురోహితులు శివకార్తీక్, వినిత్ లు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మీర్పేట్ హెచ్ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు వజ్జురి పావనిరెడ్డి, కొత్త రామారావు, గొల్లూరి అయిజయ్యలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన స్వాములకు, భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మాన్ రేగళ్ల సతీష్ రెడ్డి ఆలయ ప్రధాన కార్యదర్శి హరినాత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శేఖర్ చారి, కోషాధికారి కెఏఎన్ ప్రసాద్, నిరంజన్ దాస్ మణికంఠ నాయకులు దమ్మాయిగూడ వార్డు సభ్యులు వండాల యాదగిరిగౌడ్, సంభన బోలు హరిగౌడ్, కనుకుల రజినీకాంత్ రెడ్డి, నవీన్ గౌడ్, శివకుమార్, శ్రీకాంత్ గౌడ్, బ్రహ్మశ్రీ శివ కార్తీక్ వినీత్ సిద్దు పంతులు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తదుపరి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

# వేదమంత్రాలు, శంఖనాదం మధ్య గోదావరి నదికి హారతి

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరామచంద్రమూర్తి దివ్య సన్నిధానంలో గోదావరి నది అపారమైన మహిమ కలిగినదని అర్చకులు వివరించారు. వేదకాలం నుంచే గోదావరిని తల్లి సమానంగా భావిస్తూ, ఈ నదిలో ఒక కోటి తీర్ధాలు నిత్యం ప్రవహిస్తాయని పురాణాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. వేదమంత్రాల ఉచ్చారణతో, పుష్పార్పణలతో నది హారతి నిర్వహించగా, “రామ లక్ష్మణ జానకి జై - బోలో హనుమాన్ కి జై” నినాదాలతో పరివాహక ప్రాంతమంతా మారుమోగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని గోదావరి తల్లికి భక్తిశ్రద్ధలతో హారతి సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.





## కార్మికులపై కక్ష కట్టినట్లుగా
# సీఎం వ్యవహారం : హరీశ్‌రావు



హైదరాబాద్: డిపెండెంట్ ఉద్యోగుల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మొత్తం ఉద్యోగుల్లో సగం మంది డిపెండెంట్ ఉద్యోగులే ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పిందన్నారు. కార్మికులపై కక్ష కట్టినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. “సింగరేణి నిధులను ముఖ్యమంత్రి దుర్వినియోగం చేస్తున్నారు. మెస్సీ టూర్ కోసం సింగరేణి నిధులు ఎందుకు వాడారు? దీనిపై అధికారంలోకి వచ్చాక విచారణ చేయిస్తాం. తప్పు చేసిన వారిని జైల్లో పెడతాం. సింగరేణిని ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోంది. తక్షణమే మెడికల్ బోర్డు పెట్టి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి. లేదంటే వారితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇల్లు ముట్టడిస్తాం. జర్నలిస్టుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం. వారికి ధర్నా చేసే హక్కు లేదా.. ప్రశ్నించే హక్కు లేదా? కేసీఆర్ హయాంలో 26 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చాం. వారి సంక్షేమం కోసం రూ.100 కోట్ల నిధి ఇచ్చాం. డెస్కుల్లో పని చేసే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వబోమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. కార్డులను 26 వేల నుంచి 10 వేలకు తగ్గిస్తున్నారు” అని హరీశ్‌రావు అన్నారు.

# అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు ఏమయ్యాయి?

**: కేంద్ర మంత్రి బండి సంజయ్**



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన ‘డ్రగ్స్ కేసు’ విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ విడుదల చేసిన ప్రకటనలో ప్రశ్నించారు. “నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు.కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలి. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెద్దలతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి ‘డ్రగ్స్ కేసు’ విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ఛార్జిషీట్ దాఖలు




హైదరాబాద్: సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. మొత్తం 23 మందిపై అభియోగాలు మోపారు. ఛార్జిషీట్‌లో ఏ11గా సినీ నటుడు అల్లు అర్జున్ పేరు చేర్చారు. 2024 డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల సమయంలో పుష్ప2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి (35) అనే మహిళతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ (9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఇద్దరూ తీవ్ర గాయాలతో స్పృహ తప్పారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లి సీపీఆర్ చేశారు. హుటాహుటిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతిచెందారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో నిమ్స్‌కు తరలించారు. పుష్ప 2 సినిమా చూసేందుకు మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు రాగా... తల్లి కుమారుడు తొక్కిసలాటలో చిక్కుకున్నారు. వారిలో తల్లి మృత్యువాతపడటం విషాదాన్ని నింపింది. తొక్కిసలాటలో మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.



# తెలంగాణ టెట్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) హాల్‌టికెట్లను విద్యాశాఖ విడుదల చేసింది. టెట్ వెబ్‌సైట్ నుంచి వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరి 3, 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీల్లో పరీక్షలు ఉంటాయి. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. పేపర్ 1, 2లకు కలిపి మొత్తం 2.37 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా టెట్ తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఈసారి కేజీబీవీల్లో పనిచేసే కాంట్రాక్టు టీచర్లతో కలిపి దాదాపు 70 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి 1016 తేదీల మధ్య ఫలితాలను వెల్లడిస్తామని పాఠశాల విద్యాశాఖ గతంలోనే ప్రకటించింది.

# ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో నేరాలు 15 శాతం తగ్గాయి



హైదరాబాద్: నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించామని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ అన్నారు. ఆపరేషన్ కవచ్, డ్రోన్ల వినియోగంలో ముందున్నట్లు తెలిపారు. తెలంగాణలో అడుగుపెట్టేందుకు ఇతర రాష్ట్రాల నేరగాళ్లు భయపడుతున్నారని చెప్పారు. 2025 వార్షిక నేర నివేదికను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. “సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో నేరాలు 15 శాతం తగ్గాయి. సైబర్ నేరాలు 8 శాతం, మహిళలపై నేరాలు 6 శాతం తగ్గాయి. పోక్సో కేసులు కూడా బాగా తగ్గాయి. గతేడాది అత్యాచార కేసులు 484 నమోదైతే ఈ ఏడాది 405 నమోదయ్యాయి. కిడ్నాప్ కేసులు గతేడాది 324 నమోదైతే ఈ ఏడాది 166 ఫైల్ అయ్యాయి. ప్రాపర్టీ వివాద కేసులు 64 శాతం మేర తగ్గాయి. నేరాల్లో శిక్షలు పడిన కేసుల సంఖ్య కూడా బాగా పెరిగింది. రోడ్డు ప్రమాదాల సంఖ్య 3,058 నుంచి 2,678కి తగ్గింది. సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్థంగా పనిచేస్తోంది. నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించాం. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. మాదకద్రవ్యాల నియంత్రణకు మరిన్ని టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది జోనల్ వారీగా నార్కోటిక్ టీమ్‌లు ఏర్పాటు చేస్తాం. న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి. బహిరంగ వేడుకలు నిర్వహించాలని సూచిస్తున్నాం. మద్యం తాగిన వారు బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నాం. కుటుంబ సభ్యులతో ఇళ్లలోనే వేడుకలు చేసుకుంటే మంచిది. రాష్ అండ్ డేంజరస్ డ్రైవింగ్ కట్టడికి మరిన్ని చర్యలు చేపడతాం” అని సజ్జనార్ తెలిపారు.

## ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా.. ఉప ఎన్నిక వస్తే మళ్లీ విజయమే: దానం నాగేందర్



హైదరాబాద్: రాజీనామా అంశం, ఉపఎన్నికల్లో పోటీ చేయడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిమాయత్‌నగర్ డివిజన్ కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లేందుకు తనకు ధైర్యం ఉందని.. అది కార్యకర్తల ద్వారా వచ్చిందని చెప్పారు. కార్యకర్తల అండతోనే ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినట్లు చెప్పారు. ఉపఎన్నిక వస్తే మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం పదవికి గౌరవం ఇవ్వడం మరిచింది బీఆర్ఎస్ నేతలే అని విమర్శించారు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో అగౌరవంగా మాట్లాడింది ఆ పార్టీ వాళ్లేనని మండిపడ్డారు. విమర్శలు చేస్తే.. ప్రతివిమర్శలూ ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## ఫిల్మ్‌నగర్‌లో ఎలక్షన్ హీట్..
# రేపే ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు




టాలీవుడ్‌లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు రేపు జరగనున్న నేపథ్యంలో ఫిల్మ్‌నగర్ మొత్తం రాజకీయ వాతావరణం నెలకొంది. బడా నిర్మాతలు, చిన్న నిర్మాతల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో మాటల తూటాలు పేలుతున్నాయి. బడా నిర్మాతలపై చిన్న నిర్మాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోసం పనికిమాలిన హామీలు ఇస్తున్నారని వారు మండిపడ్డారు. చిన్న సినిమాలకు అధిక థియేటర్లు, టికెట్ ధరలు పెంచమని హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండస్ట్రీ మొత్తం ఒకరి గుప్పిట్లో ఉందని వారు హాట్ కామెంట్స్ చేశారు.

**ప్రోగ్రెసివ్ ప్యానెల్ Vs మన ప్యానెల్..**

ఈ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానెల్‌కు, మన ప్యానెల్‌కు మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. పరిశ్రమ అభివృద్ధి, చిన్న నిర్మాతల సమస్యలు, థియేటర్ల నిర్వహణ వంటి అంశాలతో రెండు ప్యానెల్‌లు ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. ప్రోగ్రెసివ్ ప్యానెల్‌కు ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్ బాబు, దిల్ రాజు బలంగా మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. ఇక, మన ప్యానెల్‌కు చదలవాడ శ్రీనివాసరావు, సి. కళ్యాణ్, ప్రసన్న కుమార్ మద్దతుగా నిలుస్తున్నారు. చిన్న నిర్మాతల హక్కులు, సమాన అవకాశాలు, పెద్ద, చిన్న తేడా లేకుండా పరిశ్రమలో న్యాయం జరగాలన్నదే తమ లక్ష్యమని వారు స్పష్టం చేస్తున్నారు. రేపు జరగనున్న TFCC ఎన్నికల్లో ఏ ప్యానెల్ విజయం సాధిస్తుందన్నది సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల ఫలితాలు టాలీవుడ్ భవిష్యత్తుపై ప్రభావం చూపనున్నాయని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



# డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి సోదరుడి పరారీ

హైదరాబాద్: మాసాబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి సోదరుడు అమన్‌ప్రీత్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం ఈగల్ టీమ్, పోలీసులు గాలిస్తున్నారు . ఈ కేసులో ఈ నెల 17న ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విని అరెస్టు చేశారు. వారిని విచారించగా అమన్‌ప్రీత్ పేరు బయటకు వచ్చింది. ఈ ఇద్దరు వ్యాపారుల నుంచి అతడు డ్రగ్స్ కొన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఇద్దరు వ్యాపారుల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం చేసుకుంది. గతేడాది కూడా అమన్‌ప్రీత్ సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. మరోవైపు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్వికి మరో నలుగురు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అది ఒక పథకం మాత్రమే కాదు..పేదల పని హక్కు: రాహుల్ గాంధీ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. దీనిని పేద ప్రజలపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఎంజీ నరేగా కేవలం ఒక పథకం మాత్రమే కాదని..పేదల పని హక్కు అని పేర్కొన్నారు. సంబంధిత మంత్రులను సంప్రదించకుండా, ప్రధాని నరేంద్ర మోదీ సొంతంగా ఈ నిర్ణయం తీసుకున్నారని..దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందనడానికి ఇదే ఉదాహరణ అని ఆరోపించారు. మోదీ ఏది కోరుకుంటే దేశంలో అదే అమలవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడడానికి ముందుకు రావాలని ప్రతిపక్ష నేతలకు పిలుపునిచ్చారు. ప్రపంచ



వ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన ఈ పథకాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోదీ ప్రభుత్వం..ఇప్పుడు గ్రామీణ ప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు ఆర్థిక భరోసాని ఇస్తూ..అన్నం పెట్టిన పథకాన్ని ఆపితే వారు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. దేశంలోని వ్యవస్థలపై కేంద్రం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై ప్రజల తరఫున కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ పథకం రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5నుంచి 'ఎంజీనరేగా బచావో అభియాన్' పేరుతో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని రాహుల్ ప్రకటించారు.

## ఉజ్జయిని మహాకాళేశ్వరుడికి..
# ఈ ఏడాది రూ.100 కోట్ల విరాళాలు

ఉజ్జయిని: మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో ఉన్న మహాకాళేశ్వరుడికి ఏటా భారీ మొత్తంలో విరాళాలు, కానుకలు వస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి డిసెంబర్ 15 వరకు 5.5కోట్ల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకోగా.. విరాళాల రూపంలో రూ.100 కోట్లకుపైగా వచ్చినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. వీటిలో రూ.13 కోట్ల విలువైన ఆభరణాలు ఉన్నాయని తెలిపింది. శీఘ్ర దర్శనం, విరాళాలు, కానుకలు, లడ్డూ ప్రసాదాల విక్రయంతో గతేడాది మొత్తంగా రూ.92



కోట్లు రాగా.. ఈసారి ఇది రూ.107 కోట్లు దాటింది. గతేడాది శ్రావణ మాసంలో రూ.22 కోట్ల ఆదాయం రాగా.. ఈ సారి రూ.30 కోట్లు వచ్చాయి. ఆలయానికి వస్తున్న విరాళాలు ఏటా పెరుగుతున్నాయని.. వీటిని భక్తుల భద్రత, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తున్నామని ఆలయ కమిటీ వెల్లడించింది. సెలవు రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోందని.. ఈ క్రిస్మస్ రోజున అత్యధికంగా 2.5లక్షల మంది మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారని తెలిపింది.

# కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి.. ఆర్ఎస్ఎస్‌పై మరో నేత ప్రశంసలు

కాంగ్రెస్‌కు మరో తలనొప్పి వచ్చి పడింది. మొన్నటివరకు ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ కేంద్రంపై, ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ.. సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా మరో సీనియర్ నేత మోదీకి చెందిన పాత ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. భాజపా సంఘ్ సిద్ధాంతాలపై ప్రశంసలు కురిపించారు. గుజరాత్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి సంబంధించిన పాత ఫొటోను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ పంచుకున్నారు. ఇందులో



భాజపా అగ్రనేత ఎల్‌కే అద్వాణీ కుర్చీలో కూర్చొని ఉండగా.. ఆయన ముందు నేలపై ప్రధాని మోదీ కూర్చొన్నట్లు ఉంది. నేలపై కూర్చొన్న వ్యక్తి దేశానికి ప్రధానిగా అయ్యారంటూ మోదీని ఉద్దేశిస్తూ దిగ్విజయ్ కొనియాడారు. 'నేను ఓ ఫొటో చూశాను. ఇది చాలా ఆసక్తికరంగా ఉంది. ఆర్ఎస్ఎస్‌లో సామాన్య కార్యకర్తలా.. నాయకుల పాదాల వద్ద నేలపై కూర్చొన్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎలా ఎదిగారో చూడండి. ఇది ఆ సంస్థ శక్తి' అని రాసుకొచ్చారు. ఈ పోస్టుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు రాహుల్, ప్రియాంక గాంధీలను ట్యాగ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు చర్చనీయాంశంగా మారింది. కాగా.. గత కొంతకాలంగా శశిథరూర్ మోదీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల మోదీకి కితాబిస్తూ థరూర్ చేసిన పోస్ట్ వైరల్ అయ్యింది. "ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని తనను అందరూ ఆరోపిస్తుంటారని మోదీ చెప్పారు. కానీ ఆయన ప్రజల సమస్యల విషయంలో ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారు" అని థరూర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ప్రారంభం

ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభమైంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌తో సహా అనేకమంది హాజరయ్యారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలకు సంబంధించి వ్యూహాలు రూపొందించడం, ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలతో సహా పలు కీలక అంశాలపై ఇందులో చర్చించనున్నట్లు తెలుస్తోంది. సమావేశం ప్రారంభానికి ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తొలి వర్ధంతి సందర్భంగా సీడబ్ల్యూసీ సభ్యులు నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ నేతలు శివరాజ్ పాటిల్, శ్రీ ప్రకాశ్ జైస్వాల్‌లకు సంతాపం తెలిపారు. ఇక, ఇటీవల బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత జరుగుతున్న తొలి సీడబ్ల్యూసీ సమావేశం ఇది. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా ప్రజల



మద్దతును సమీకరించేందుకు సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలకు సంబంధించిన ప్రణాళికను ఖరారు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి. సోనియా, రాహుల్‌పై మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న నేషనల్ హెరాల్డ్ కేసు గురించి, పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలపైనా చర్చించే అవకాశం ఉంది. కాగా.. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడుల గురించి ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**పార్టీ నేతల నిరసనలు..**

ఇక, ఓవైపు సమావేశం జరుగుతుండగా.. పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు బయట నిరసనలు చేపట్టారు. కర్ణాటక ముఖ్యమంత్రి పదవిని తమ నాయకుడికి కట్టబెట్టాలంటూ రాష్ట్ర హోం మంత్రి జి.పరమేశ్వరన్ మద్దతుదారులు డిమాండు చేస్తున్నారు. బ్యానర్లు పట్టుకొని.. తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

## రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు
# ఎంతమందో చెప్పాలి - టీఎంసీ

పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 58 లక్షలమంది పేర్లను తొలగించిన విషయం తెలిసిందే. అయితే, ఇందులో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు ఎంతమంది ఉన్నారనే వివరాలను ఎన్నికల సంఘం బయట పెట్టాలని తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. బెంగాల్ జనాభా 10.05 కోట్ల మంది కాగా.. తాజా ఎస్ఐఆర్ ప్రక్రియలో దాదాపు ఐదు శాతం మంది ఓటర్లను తొలగించారని తృణమూల్ కాంగ్రెస్ పేర్కొంది. ఎస్ఐఆర్ చేపడుతోన్న ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ సంఖ్య ఇక్కడే తక్కువని తెలిపింది. అయితే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో



భాజపాకు లబ్ధి చేకూర్చేందుకే లక్షలాది మంది అర్హులైన ఓటర్లను తొలగించారని ఆరోపించింది. ఈ క్రమంలో తమ ఆందోళనలను వ్యక్తం చేస్తూ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు రాష్ట్ర మంత్రుల ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది.

## పాక్ హెచ్చరికలను
# భారత్ తేలిగ్గా తీసుకోకూడదు



: **శశిథరూర్**

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతోందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతోందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.

# జెన్‌జీ మున్సిపల్ ఛైర్‌పర్సన్.. చరిత్ర సృష్టించిన దియా..!

21 ఏళ్లు.. డిగ్రీ చదువు గురించో.. ఏ కెరీర్ ఎంచుకుంటే బాగుంటుందా..? అని ఈ వయసు యువతరం ఆలోచిస్తుంటుంది. కానీ కేరళకు చెందిన దియాబిను పుళిక్కకందమ్ మాత్రం మున్సిపల్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆ రాష్ట్రం నుంచి ఈ ఘనత సాధించిన తొలి జెన్‌జీ అమ్మాయి ఈమెనే కావడం విశేషం. కేరళలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో పాలా మున్సిపాలిటీలోని 15వ వార్డు నుంచి 21 ఏళ్ల దియా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, విజయం సాధించారు. ఆమె తండ్రి, అంకుల్ కూడా ఈ ఎన్నికల్లో గెలుపొందారు. అయితే ఫలితాల తర్వాత ఏ ఒక్క పార్టీకి పూర్తిస్థాయి మెజార్టీ లభించలేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్‌కు 12 సీట్లు, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు 10 స్థానాలు దక్కాయి. స్వతంత్రులు నలుగురు గెలవగా.. అందులో ముగ్గురు దియా కుటుంబానికి చెందినవారే. మరొకరు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి మాయా రాహుల్. దాంతో 26 మంది సభ్యులు ఉన్న పాలకమండలిలో స్వతంత్రులే కింగ్ మేకర్స్ అయ్యారు. కొన్ని రోజుల చర్చల తర్వాత దియా కుటుంబం కాంగ్రెస్‌కు మద్దతు పలికింది. వీరితో పాటు రెబల్ అభ్యర్థి హస్తం వైపే మొగ్గు చూపింది. దాంతో దియాను ఛైర్‌పర్సన్ పదవి, మాయాను వైస్ ఛైర్‌పర్సన్ పదవి వరించాయి. ఈ పదవి దక్కడంపై దియా మీడియాతో మాట్లాడుతూ హర్షం వ్యక్తంచేశారు. "దీర్ఘకాలిక





ప్రణాళికతో మున్సిపాలిటీలో ప్రాథమిక సదుపాయాలు అందేలా చూస్తాను. నా తండ్రి విజయం సాధించడం ఇది ఐదోసారి. ప్రజల కోసం ఆయన చేస్తోన్న సేవను చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. అదే నాకు స్ఫూర్తి" అని చెప్పిన దియా.. మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ నుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు. ఒక ప్రజానేతగా విధులు నిర్వర్తిస్తూనే ఉన్నత విద్యను అభ్యసిస్తానని చెప్పి, చదువుపై తనకున్న అభిరుచిని వ్యక్తంచేశారు. ఇదిలాఉంటే.. గతంలో కూడా స్థానిక సంస్థల విషయంలో కేరళ వార్తల్లో నిలిచింది. 2020లో తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఆర్యా రాజేంద్రన్ నియమితులయ్యారు. అప్పుడు ఆమె వయసు 21 ఏళ్లే. పిన్న వయసులోనే మేయర్‌గా ఎన్నికై యావత్ దేశం దృష్టిని ఆకర్షించారు.

# వాళ్లు కలుస్తారని 'సిక్స్ సెన్స్' చెప్పింది: అత్యాచార కేసులో సుప్రీం వ్యాఖ్యలు

ఓ అత్యాచార కేసులో దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అత్యాచార కేసులో దోషిగా తేలిన వ్యక్తి, బాధితురాలు ముందు ఏకాభిప్రాయంతోనే ఉన్నారని.. ఆ తర్వాత వారి మధ్య వచ్చిన విభేదాల వల్ల అతడిపై కేసు నమోదు చేసినట్లు గమనించామని న్యాయమూర్తులు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం తెలిపింది. అపార్థాల వల్ల విడిపోయిన వారు మళ్లీ కలుస్తారని తమ 'సిక్స్ సెన్స్' చెప్పిందని పేర్కొంది. బాధితురాలిని దోషి వివాహం చేసుకోవడంతో అతడిపై ఉన్న ఫిర్యాదు, శిక్షను రద్దు తాజాగా చేస్తున్నట్లు వెల్లడించింది. పోలీసు ఛార్జిషీట్ ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళకు 2015లో సోషల్ మీడియా ద్వారా ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొంతకాలం వారు రిలేషన్‌షిప్‌లో



ఉన్నారు. అనంతరం వివాహం విషయంలో ఇరువురి మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో తనను వివాహం చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ మహిళ 2021లో అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు ఆ వ్యక్తిని దోషిగా నిర్ధరించి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరగా.. అందుకు హైకోర్టు నిరాకరించడంతో అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. గతంలో ఈ కేసుపై సుప్రీంకోర్టు జరిపిన ప్రత్యేక విచారణలో బాధితురాలు, దోషి వివాహం చేసుకోవడానికి సుముఖత వ్యక్తంచేయడంతో.. వివాహం కోసం జులైలో న్యాయస్థానం అతడికి మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. ఈ కేసుపై తాజాగా చేపట్టిన విచారణలో భాగంగా ప్రస్తుతం ఆ జంట సంతోషంగా ఉన్నారని న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. దీంతో నిందితుడిపై ఉన్న అత్యాచారం కేసును రద్దు చేస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం వెల్లడించింది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో అతడు చేసిన ఉద్యోగంలోనే తిరిగి నియమించాలని మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను కోర్టు ఆదేశించింది.

# ఢిల్లీలో భారీ ఆపరేషన్.. 285 మంది అరెస్టు..!

న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. భారీఎత్తున డ్రగ్స్‌తో పాటు 40కి పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఈనేపథ్యంలో 285 మందిని అరెస్టు చేశారు. 'ఆపరేషన్ ఆఘాత్ 3.0' పేరిట ఆగ్నేయ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అర్ధరాత్రి వేళ తనిఖీలు చేపట్టారు. వీధి రౌడీలు, నేరస్థులతో సంబంధం ఉన్న అనుమానితులే లక్ష్యంగా తనిఖీలు చేశారు. కొత్త సంవత్సర వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దీన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఆపరేషన్‌లో భాగంగా దాదాపు 285 మందిని అరెస్టు చేశామని.. మరో 504 మందిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారినుంచి దేశీయంగా తయారుచేసిన 21 పిస్టల్స్, 20 తూటాలు, 27 కత్తులతో పాటు పెద్దఎత్తున మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి దాదాపు రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.



ఉన్ని దుస్తులు

# శుభ్రం చేయాలంటే..!

**చలి నుంచి తట్టుకోవడానికి ఇంటా, బయటా స్వెట్టర్లు, కోట్స్, స్కార్ఫ్స్, మంకీ క్యాప్స్.. వంటివి ధరించడం సహజమే! అయితే వాటిని ఇతర దుస్తుల్లా రోజూ ఉతకం. అలాగని రోజుల తరబడి వాటిని అలాగే ధరించడం వల్ల.. చెమట, దుమ్ము-ధూళి వాటిపై చేరి దుర్వాసన వస్తుంటుంది. ఇలాంటప్పుడు ఉతక్కుండానే ఉన్ని దుస్తుల్ని శుభ్రం చేయచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొన్ని ఇంటి చిట్కాలు మేలు చేస్తాయని చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి..**

సాధారణ దుస్తుల్లా ఉన్ని దుస్తుల్ని రోజూ ఉతకడం వల్ల వాటి నాణ్యత దెబ్బతింటుంది.. అలాగే రంగు వెలిసిపోవడం, వాటి నుంచి పోగులు బయటికి రావడం.. వంటివీ జరుగుతాయి. అందుకే వాటిని తరచూ ఉతకం. అలాగని పదే పదే వాటినే ధరించడం వల్ల చెమట వాసన వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి కొన్ని చిట్కాలతో ఉతక్కుండానే ఉన్ని దుస్తుల్ని శుభ్రం చేయచ్చంటున్నారు నిపుణులు.

**ఇవి ప్రయత్నించండి!**

* బేకింగ్ సోడాకు సహజసిద్ధమైన డియోడరంట్‌గా పేరుంది. ఇది దుస్తులపై తేమ, దుర్వాసనల్ని పీల్చుకొని తాజాదనాన్ని అందిస్తుంది. ఇందుకోసం బేకింగ్ సోడాను ఉన్ని దుస్తులపై చల్లాలి. ముఖ్యంగా చంకలు, మోచేతులు, మెడ.. వంటి భాగాల్లో చెమట ఎక్కువగా వస్తుంటుంది. కాబట్టి దుస్తులపై ఆయా భాగాల్లో సోడా చల్లి రాత్రంతా అలాగే వదిలేయాలి. ఉదయాన్నే ఆ దుస్తుల్ని ఒకసారి దులిపితే సోడా తొలగిపోతుంది. ఒకవేళ దుస్తులపై ఇంకా సోడా ఉందనిపిస్తే మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌తో నెమ్మదిగా రుద్ది.. మరోసారి వాటిని దులిపితే అవి శుభ్రమవుతాయి.
* వెనిగర్, నీళ్లు సమపాళ్లలో తీసుకొని స్ప్రే బాటిల్‌లో నింపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఉన్ని దుస్తులపై స్ప్రే చేయాలి. చెమట పట్టే ప్రదేశాల్లో మరింత ఎక్కువ మిశ్రమం స్ప్రే చేయాలి. ఆపై ఈ దుస్తుల్ని ఆరుబయట నీడలో ఆరేయాలి. తద్వారా వాటి నుంచి దుర్వాసనలు దూరమవుతాయి. అలాగే వెనిగర్‌లో ఉండే యాంటీబ్యాక్టీరియల్ గుణాలు దుస్తులపై చేరిన బ్యాక్టీరియానూ నశింపజేస్తాయి. ఫలితంగా అవి శుభ్రపడతాయి.
* ఉన్ని దుస్తులపై చెమట పేరుకుపోవడం వల్ల అక్కడ బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. అలా జరగకుండా ఉండాలంటే అత్యవసర నూనెలతో తయారుచేసిన స్ప్రే ఉపయోగించాల్సిందే! ఇందుకోసం స్ప్రే బాటిల్‌లో నీళ్లు నింపి.. ఐదారు చుక్కల ఏదైనా అత్యవసర నూనెను అందులో వేయాలి. ఆపై బాగా షేక్ చేసి ఉన్ని దుస్తులపై ఈ మిశ్రమాన్ని స్ప్రే చేయాలి. వీటిని గాలి బాగా తగిలే ప్రదేశంలో వేలాడదీసి కొన్ని గంటల పాటు అలాగే వదిలేయాలి. ఫలితంగా ఆ దుస్తులు శుభ్రపడడంతో పాటు వాటి నుంచి సువాసనలు వెదజల్లుతాయి.

# ఆ మొక్కల్ని మళ్లీ నాటేటప్పుడు..!

**ఇంట్లో ఖాళీ స్థలంతో సంబంధం లేకుండా కుండీల్లో మొక్కల్ని పెంచుకోవడం ఈ రోజుల్లో చాలామందికి కామనైపోయింది. అయితే కొన్ని మొక్కలు పెరిగే కొద్దీ.. వాటి వేర్లు విస్తరించి కుండీ పగిలిపోయినప్పుడు లేదంటే ఏపుగా పెరగాలని.. ఇప్పుడున్న కుండీ నుంచి కొత్త కుండీకి మార్చడం.. వంటివి చేస్తుంటారు కొందరు. ఈ క్రమంలో తెలిసో తెలియకో చేసే కొన్ని పొరపాట్ల వల్ల మొక్కల ఆరోగ్యం దెబ్బతింటుందంటున్నారు నిపుణులు. అందుకే మొక్కల కుండీలు మార్చే క్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమంటున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి..**

**సైజు ముఖ్యం!**

ఇప్పుడున్న కుండీ నుంచి కొత్త కుండీలోకి మొక్కల్ని మార్చే క్రమంలో కాస్త పెద్ద సైజు కుండీనే ఎంచుకోవడం చాలామందికి అలవాటు! కానీ దీనివల్ల మొక్కలకు అవసరానికి మించి నీళ్లు అందే అవకాశం ఉన్నట్లు, దీనివల్ల మొక్క కుళ్లిపోయే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే కొత్త కుండీ సైజు మరీ పెద్దగా కాకుండా.. ఇప్పుడున్న సైజు కంటే ఒక అంకె ఎక్కువగా ఉన్నది తీసుకుంటే సరిపోతుందంటున్నారు.

**మట్టిలోనూ తేడాలొద్దు!**

మొక్కల్ని ఒక కుండీ నుంచి మరో కుండీలోకి మార్చేటప్పుడు అందులో నింపే మట్టి విషయంలోనూ జాగ్రత్తపడడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో అంతకుముందు



మొక్క పెరిగిన మట్టి మిశ్రమం లాంటిదే కొత్త కుండీలోనూ వేయడం మంచిదంటున్నారు. దీనివల్ల మొక్కకు అందే పోషకాల విషయంలో లోపం లేకుండా ఉంటుంది. అలాగే కొన్ని మొక్కలకు రోజంతా నీటి అవసరం ఉంటుంది.. మరికొన్ని మొక్కలు పొడిగా ఉండే మట్టిలోనూ ఏపుగా పెరుగుతాయి. కాబట్టి ఆయా మొక్కల అవసరాల్ని బట్టి కూడా తేమను నిలిపి ఉంచేలా లేదంటే కాసేపటికే పొడిగా మారే తత్వం ఉన్న మట్టిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అప్పుడే కుండీ మార్చినా మొక్క ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చు.

**అనువైన కాలంలో..**

ఆయా కాలాలతో సంబంధం లేకుండా తోచినప్పుడు మొక్కల్ని ఒక కుండీలో నుంచి మరో కుండీలోకి మార్చుతుంటారు చాలామంది. ఇలాంటి సందర్భాల్లో చాలావరకు మొక్కలు ఎండిపోవడం గమనిస్తుంటాం. మొక్కల్ని తిరిగి నాటే విషయంలో అవగాహన లోపమే ఇందుకు కారణమంటున్నారు నిపుణులు. ఎప్పుడు పడితే అప్పుడు వీటిని ఒక కుండీలో నుంచి మరో కుండీలోకి మార్చడం వల్ల వాటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందట! అందుకే మొక్కలు చిగురించేందుకు అనువైన కాలంలో మాత్రమే కొత్త మొక్కలు నాటడం, పాత మొక్కల్ని మరో కుండీలో నాటడం మంచిదంటున్నారు నిపుణులు.

**వేర్లు జాగ్రత్త!**

ఒక కుండీలోని మొక్కల్ని మరో కుండీలోకి మార్చినప్పుడు లేదంటే తిరిగి నాటినప్పుడు.. కేవలం మొక్కతో పాటు కొంతవరకున్న వేర్లను మాత్రమే తీసుకుంటుంటారు చాలామంది. కానీ ఇది సరికాదంటున్నారు నిపుణులు. మొక్కల్ని పాత కుండీ నుంచి వేరు చేసినా.. తిరిగి నాటేటప్పుడు కూడా



పూర్తి వేర్లతో తీసుకోవడం.. అవి డ్యామేజ్ కాకుండా తిరిగి మట్టిలో కూర్చడం.. ఈ రెండూ ముఖ్యమంటున్నారు. అప్పుడే అవి మట్టితో అనుబంధాన్ని పెనవేసుకోగలవని, ఆరోగ్యంగా ఎదగగలవని చెబుతున్నారు. ఇక్కడ మరో విషయం ఏంటంటే.. ఇలా తిరిగి నాటే క్రమంలో కుళ్లిపోయిన వేర్లు ఏమైనా ఉంటే ముందే కట్ చేయడం మంచిది. అప్పుడే మొక్క ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చు.

**నీళ్లు ఎక్కువ వద్దు!**

మొక్కను కొత్త కుండీలో తిరిగి నాటాం కదా.. ఎక్కువ మొత్తంలో నీళ్లు పోస్తేనే అది ఎప్పటిలాగా ఎదగగలుగుతుంది అనుకుంటారు కొందరు. ఇదీ పొరపాటే అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నాటిన వెంటనే మొక్కకు నీళ్లు పోసి.. రెండు మూడు రోజుల పాటు అలా వదిలేయడం లేదంటే కొన్ని నీళ్లు అలా పైపైన చల్లడం వల్ల మొక్క మట్టిలో అడ్జస్ట్ అవుతుంది. అలా కాకుండా ముందే ఎక్కువ నీళ్లు పెడితే వాటి వేర్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. అందుకే మొక్కకు అవసరమైనంత మేరకే నీళ్లు పోయాలంటున్నారు నిపుణులు. ఇలా పోసిన నీళ్లు మట్టిలో నిల్వ ఉండకుండా.. కుండీని ఎంచుకునేటప్పుడు అడుగున రంధ్రం ఉందో లేదో చూసుకోవడమూ మర్చిపోకూడదు.

















# కొరియన్లవే మెచ్చారు!

**కొరియన్ వెబ్‌సిరీస్‌లు, సినిమాలను దాటింది మన అమ్మాయిల అభిమానం. కాబట్టే, వాళ్ల స్టైల్, యాక్సెసరీలు అన్నింటినీ అనుసరించేస్తున్నారు. ఈ ఏడాది అలా మనవాళ్ల మనసు దోచినవేంటో తెలుసా? హెయిర్ యాక్సెసరీలు. సాఫ్ట్ పేస్టల్ రంగులు, అల్ట్రా గ్లామ్ హంగులు వంటివి వాళ్లని బాగా ఆకట్టుకున్నాయి. పైగా ధర కూడా అందుబాటులోనే ఉండటంతో పోటీపడి మరీ కొనేసుకున్నారు. పేస్టల్ క్లా క్లిప్స్, శాటిన్ స్క్రంచీలు, పెరల్ బాబీ పిన్లు, హెయిర్ బోలు, బ్యారెట్, ఆక్రిలిక్ క్లిప్‌లు... ఎంచుకోవడానికి బోలెడు రకాలు. ఇంకేం, 'మై కొరియన్ హెయిర్ కలెక్షన్' అంటూ నచ్చినవన్నీ తెచ్చేసుకున్నారు. వాటితో బోలెడు స్టైల్స్ ప్రయత్నించి, సోషల్‌మీడియాలోనూ పంచుకున్నారు. కాబట్టే, ఈ ఏడాది ట్రెండ్‌గానూ మారాయి. మీరూ వీటికి ఫ్యానేనా? అయితే ప్రయత్నించేయండి మరి!**















## సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌ని వెనక్కి నెట్టి.. రిచ్‌లిస్ట్‌లో అగ్రస్థానంలో నిలిచిన జయశ్రీ ఉల్లాల్



**న్యూఢిల్లీ:** ప్రపంచ టెక్ రంగంలో అత్యంత సంపన్న సీఈవోలు ఎవరంటే ముందుగా గుర్తొచ్చే పేర్లు భారత సంతతికి చెందిన సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఇద్దరూ టెక్ రంగంలో భారత సంతతికి చెందిన అత్యంత సంపన్న ఎగ్జిక్యూటివ్‌లుగా కొనసాగుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆ స్థానాన్ని వారు కోల్పోయారు. తాజా నివేదికల ప్రకారం ఈ ఇద్దరినీ వెనక్కి నెట్టి అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈవో జయశ్రీ ఉల్లాల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.

హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం.. టెక్ సీఈవోల్లో జయశ్రీ ఉల్లాల్ అత్యంత సంపన్నురాలిగా నిలిచారు. రూ.50,170 కోట్ల నికర విలువతో ఉల్లాల్ అగ్రస్థానంలో నిలిచారు. ఆ తర్వాత మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల రూ.9,770 కోట్ల నికర విలువతో రెండోస్థానంలో నిలవగా.. రూ. 5,810 కోట్లతో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఏడో స్థానాన్ని సరిపెట్టుకున్నారు.

### ఎవరీ జయశ్రీ ఉల్లాల్..

పలు నివేదికల ప్రకారం.. ఉల్లాల్ 1961, మార్చి 27న లండన్‌లో భారత సంతతికి చెందిన హిందూ కుటుంబంలో జన్మించారు. అయితే ఐదేళ్ల వయసులో ఆమె కుటుంబం భారత్‌కు వలస వచ్చేసింది. ఆమె తండ్రి ఒక భౌతిక శాస్త్రవేత్త. ఆయన ఐఐటీల ఏర్పాటులో కీలక పాత్ర పోషించినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. జయశ్రీ న్యూఢిల్లీలోని కాన్వెంట్ ఆఫ్ జీసెస్ అండ్ మేరీలో పాఠశాల విద్యను అభ్యసించారు. అనంతరం తండ్రి ఉద్యోగరీత్యా శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్లారు. అక్కడ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు జయశ్రీ.

కెరీర్ తొలినాళ్లలో పలు సంస్థల్లో పనిచేసిన జయశ్రీ.. 2008 నుంచి కంప్యూటర్ నెట్‌వర్కింగ్ సంస్థ అయిన అరిస్టా నెట్‌వర్క్స్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం 2024లో కంపెనీ ఆదాయం 7 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం అధికం. కంపెనీ స్టాక్‌లో జయశ్రీకి దాదాపు 3 శాతం వాటా ఉంది. ఆమె నేతృత్వంలో సంస్థ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది.

## ఆశ్చర్యం.. ఒక్కరోజే రూ.20 వేలు పెరిగిన వెండి ధర..!



**న్యూఢిల్లీ:** దేశంలో గత కొన్ని నెలలుగా వెండి, బంగారం ధరలు శరవేగంగా పెరుగుతున్నాయి. బంగారం కంటే వెండి మరింత వేగంగా పరుగులు తీస్తున్నది. ఇవాళ 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,200 పెరిగి రూ.1,41,220 చేరగా.. 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,100 పెరిగి రూ.1,28,350కి పెరిగింది. వెండి మాత్రం ఏకంగా రూ.20 వేలు పెరిగింది.

కిలో వెండి ధర శుక్రవారం రూ.2.54 లక్షలు ఉండగా.. ఇవాళ నమ్మశక్యంకాని రీతిలో ఏకంగా రూ.20 వేలు పెరిగి రూ.2.74 లక్షలకు చేరుకుంది. శుక్రవారం కూడా వెండి ధర భారీగానే పెరిగింది. గురువారం కిలో వెండి ధర రూ.2.45 లక్షలు ఉండగా.. శుక్రవారం రూ.9 వేలు పెరిగి రూ.2.54 లక్షలకు పెరిగింది. ద్రవ్యోల్బణం, ఆర్థిక హెచ్చుతగ్గులు లాంటి వివిధ సవాళ్ల కారణంగా వెండి, బంగారం తరచూ వాటి విలువను పెంచుకుంటున్నాయి.

దాంతో తరతరాలుగా బంగారం, వెండి లోహాలు స్థిరమైన పెట్టుబడిగా పరిగణించబడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దీర్ఘకాలికంగా పెట్టుబడి పెట్టాలనుకునే వారికి వెండి ఒక అద్భుతమైన ఎంపికగా మారింది. ఇవాళ వెండి ధర అమాంతం రూ.20 వేలు పెరగడం బులియన్ మార్కెట్ నిపుణులను కూడా ఆశ్చర్యపరుస్తోంది. భవిష్యత్తులో బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## ఆల్‌టైమ్ హైకి చేరుకున్న బంగారం ధరలు..

### తులం ధర 1.42 లక్షలు



**న్యూఢిల్లీ:** బంగారం, వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. శుక్రవారం మరో ఆల్‌టైం హైకి చేరుకున్నాయి. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ నెలకొనడంతో ధరలు భారీగా పుంజుకుంటున్నాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది.

ఇక పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.2,36,350ని తాకింది. రూ.9,350 అధికమైంది. గత నాలుగు రోజుల్లోనే ఏకంగా రూ.32,250 లేదా 15.8 శాతం ఎగబాకింది. ఈ నెల 19న కిలో ధర రూ.2,04,100గా ఉన్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు కిలో వెండి ఏకంగా రూ.1,46,650 లేదా 163.5 శాతం ఎగబాకినట్టు అయింది. డిసెంబర్ 31, 2024న రూ.89,700గా ఉంది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర మరో రూ.1,500 ఎగబాకి నూతన రికార్డు స్థాయి 1,42,300కి చేరుకున్నది.

ఈ ఏడాది ఇప్పటి వరకు తులం బంగారం రూ.63,350 లేదా 80.24 శాతం పెరిగింది. డిసెంబర్ 31, 2024న ధర రూ.78,950గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 50.87 డాలర్లు లేదా 1.13 శాతం ఎగబాకి 4,530.42 డాలర్లు పలికింది. ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు దూసుకుపోతున్నాయని షేర్‌ఖాన్ మిరాయ్ అసెట్ హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు. అలాగే ఔన్స్ వెండి తొలిసారిగా 75 డాలర్లు దాటింది.



# 15 ఏళ్ల నిరీక్షణకు తెర

**ఆసీస్ గడ్డపై ఇంగ్లండ్ చారిత్రక విజయం..**

**ఆస్ట్రేలియా గడ్డపై దాదాపు 15 ఏళ్ల తర్వాత టెస్టు గెలిచిన ఇంగ్లండ్**

**మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో యాషెస్ టెస్టులో 4 వికెట్ల తేడాతో విజయం**

**కేవలం రెండంటే రెండు రోజుల్లోనే ముగిసిన బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్**

**తొలి మూడు టెస్టులు ఓడి సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఊరట**



**మెల్‌బోర్న్:** యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడి సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు, ఎట్టకేలకు పరువు నిలబెట్టుకుంది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన నాలుగో టెస్టులో ఆతిథ్య జట్టుపై 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు మ్యాచ్ గెలవడం కోసం దాదాపు 15 ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు ఈ గెలుపుతో తెరపడింది. పేసర్లకు స్వర్గధామంగా మారిన పిచ్‌పై ఈ బాక్సింగ్ డే టెస్ట్ కేవలం రెండు రోజుల్లోనే ముగియడం విశేషం.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు మంచి ఆరంభం లభించింది. జోష్ టంగ్ (5 వికెట్లు) దెబ్బకు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌ను ఆసీస్ బౌలర్లు దెబ్బతీశారు. నెసెర్, బోలాండ్ ధాటికి ఇంగ్లీష్ జట్టు 110 పరుగులకే ఆలౌట్ కావడంతో ఆస్ట్రేలియాకు 42 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రెండో రోజు ఆటలో ఇంగ్లండ్ బౌలర్లు విజృంభించారు. బ్రైడన్ కార్స్ (4/34), బెన్ స్టోక్స్ (3/24) అద్భుతంగా రాణించడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే పరిమితమైంది. దీంతో ఇంగ్లండ్‌కు 175 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

సులభమైన లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఓపెనర్లు బెన్ డకెట్ (34), జాక్ క్రాలీ (37) దూకుడైన ఆరంభాన్ని ఇచ్చారు. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయినా జాకబ్ బెథెల్ (40) సంయమనంతో ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఇప్పటికే ఆస్ట్రేలియా 3-0 తేడాతో సిరీస్ కైవసం చేసుకోగా, ఈ విజయంతో ఇంగ్లండ్ కు కాస్త ఊరట లభించింది. ఆస్ట్రేలియాలో జో రూట్‌కు 18 టెస్టుల తర్వాత, బెన్ స్టోక్స్‌కు 13 టెస్టుల తర్వాత ఇదే తొలి విజయం. ఇరు జట్ల మధ్య చివరిదైన ఐదో టెస్టు జనవరి 4న సిడ్నీలో ప్రారంభం కానుంది.

**సంక్షిప్త స్కోర్లు:**

ఆస్ట్రేలియా: తొలి ఇన్నింగ్స్: 152బీ రెండో ఇన్నింగ్స్: 132

ఇంగ్లండ్: తొలి ఇన్నింగ్స్: 110బీ రెండో ఇన్నింగ్స్: 178/6.

## క్రికెట్ మ్యాచ్ చూస్తూ.. మైదానంలోనే ప్రాణాలు విడిచిన కోచ్..!



**ఢాకా:** క్రికెట్ మైదానంలో విషాదం నెలకొంది. ఢాకా క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ హఠాత్తుగా మరణించాడు. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ సమయంలో ఉన్నట్టుండి కుప్పకూలిన ఆయన 50 ఏళ్ల వయసులో కన్నుమూశాడు. తమ కోచ్‌ను బతికించుకునేందుకు క్యాపిటల్స్ యాజమాన్యం ఆయనను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దాంతో.. ఢాకా క్యాపిటల్స్ ఆటగాళ్లు, సిబ్బంది సహా యావత్ క్రీడాలోకం షాక్‌కు గురైంది.

బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో శనివారం ఢాకా క్యాపిటల్స్‌కు తొలి మ్యాచ్. సిల్హెట్ అంతర్జాతీయ మైదానంలో మ్యాచ్‌కు ముందు మహబూబ్ అలీ జకీ పిచ్ వద్దకు వెళ్లి పరిశీలించిన ఆయన.. మ్యాచ్ చూస్తూ చూస్తూ కిందపడిపోయాడు. అలీ అలా పడిపోవడం చూసిన సహాయక సిబ్బంది, వైద్య బృందం వెంటనే కార్డియోపల్మోనరీ రిసాసిటేషన్( సీపీఆర్) ఆయన ప్రాణాలకు కాపాడేందుకు చేశారు.

అయినా ఆయనలో చలనం లేకపోవడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అలీ చనిపోయాడని వైద్యులు తెలిపారు. అసిస్టెంట్ కోచ్‌గా సేవలందిస్తున్న అలీ మరణవార్తను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ డెబాషిశ్ చౌదరీ మీడియాకు వెల్లడించాడు. గతంలో అలీకి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని.. ఆయన మరణం అందర్నీ షాక్‌కు గురిచేసిందని డెబాశిష్ చెప్పాడు. మాజీ పేసర్ అయిన మహబూబ్ అలీ జకీ వీడ్కోలు తర్వాత కోచ్ అవతారమెత్తాడు. 2008లో హై పెర్ఫార్మెన్స్ కోచ్‌గా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులో చేరిన ఆయన.. సీనియర్ పేసర్ తస్కిన్ అహ్మదద్‌కు తర్ఫీదునివ్వడం ద్వారావెలుగులోకి వచ్చిన అలీ అకాల మరణం బంగ్లా క్రికెట్‌కు తీరని లోటు అని విశ్లేషకులు, మాజీ క్రికెటర్లు అంటున్నారు. అలీ మృతిపట్ల బంగ్లా బోర్డు సంతాపం తెలిపింది.

## ఆ ఓటమి బాధిస్తోంది.. టీమిండియాపై ప్రతీకారం తీర్చుకుంటాం..!



**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ ఏదైనా ఆస్ట్రేలియా ఆధిపత్యం మామూలే. కానీ, పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్‌లో మాత్రం భారత జట్టు చేతిలో మాజీ ఛాంపియన్ సెమీస్‌లోనే ఇంటిదారి పట్టింది. రికార్డు స్థాయిలో తమను కప్ గెలవకుండా చేసిన టీమిండియాపై ఆసీస్ జట్టు సభ్యులు కాస్త గుర్రుగానే ఉన్నారు. తాజాగా కంగారూ పేసర్ కిమ్ గార్త్ మాట్లాడుతూ.. సెమీఫైనల్లో ఓటమిని తాము ఇంకా మర్చిపోలేదని అంది. టీమిండియాపై కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆమె అంటోంది.

ఆస్ట్రేలియా బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్ పాడ్‌కాస్ట్‌లో శనివారం కిమ్ గార్త్ మాట్లాడింది. ఈ సందర్భంగా వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో టీమిండియా చేతిలో ఓటమిని ప్రస్తావించింది. వచ్చే ఏడాది స్వదేశంలో జరుగబోయే ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్‌ను ఓడించి దెబ్బకు దెబ్బ తీస్తామని ధీమాగా చెప్పింది స్పీడ్‌స్టర్. 'పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఓటమి మమ్మల్ని ఇంకా బాధిస్తోంది. భారత్ మెరుగైన జట్టే. ఇండియాలో ఆడిన ప్రతి మ్యాచ్ గొప్పగా అనిపిస్తుంది. అయినా సరే పరాజయాన్ని ఇప్పటికీ మేము జీర్ణించుకోలేకపోతున్నాం.

ఆ ఓటమికి బదులు తీర్చుకుంటాం. రెండు నెలల్లో టీ20, వన్డే సిరీస్, టెస్టు మ్యాచ్ కోసం టీమిండియా మా దేశానికి వస్తుంది. అప్పుడు ఓడించి ప్రతీకారం తీర్చుకుంటాం' అని గార్త్ పేర్కొంది. సెమీఫైనల్లో గార్త్ 7 ఓవర్లలో 46 పరుగులిచ్చి 2 వికెట్లు తీసింది. 2026లో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఫిబ్రవరి-మార్చిలో ఆతిథ్య జట్టుతో టీమిండియా మూడు టీ20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు మ్యాచ్ ఆడనుంది.

డీవై పాటిల్ మైదానం వేదికగా జరిగిన సెమీఫైనల్లో ఫొబే లిచ్‌ఫీల్డ్ (119) సెంచరీతో మెరవగా ఆస్ట్రేలియా 338 పరుగులు చేసింది. అనంతరం భారీ ఛేదనలో టీమిండియాకు షాకిస్తూ ఆరంభంలోనే ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానలను ఔట్ చేసింది కిమ్ గార్త్. దాంతో.. భారత్ ఒత్తిడిలో పడినా జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) చిరస్మరణీయ శతకంతో ఆసీస్ ఆశలపై నీళ్లు చల్లింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89)తో కీలక భాగస్వామ్యం.. ఆపై రీచా ఘోష్(26) మెరుపులతో ఫైనల్ చేరింది భారత్. టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తుచేసిన విమెన్ ఇన్ బ్లూ తొలిసారి విశ్వవిజేతగా అవతరించింది.

# హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త ప్రపంచ రికార్డ్..

**టీ20 చరిత్రలో అగ్రస్థానం**

**టీ20 కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రపంచ రికార్డ్**

**ఆసీస్ దిగ్గజం మెగ్ లానింగ్ రికార్డును అధిగమించిన కౌర్**

**కెప్టెన్‌గా 77వ టీ20 విజయాన్ని నమోదు చేసిన హర్మన్**

**పురుషులు, మహిళల క్రికెట్‌లో ఇదే అత్యధికం**




**న్యూఢిల్లీ:** భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. టీ20 ఫార్మాట్‌లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో నిన్న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో హర్మన్‌ప్రీత్ ఈ అరుదైన ఘనతను అందుకుంది.

కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్‌కు ఇది 77వ టీ20 విజయం. దీంతో ఆమె ఆస్ట్రేలియా దిగ్గజ క్రీడాకారిణి మెగ్ లానింగ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. పురుషుల, మహిళల క్రికెట్‌లో కలిపి ఏ కెప్టెన్‌కూ ఇన్ని విజయాలు లేకపోవడం విశేషం. పురుషుల టీ20ల్లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ 50 విజయాలతో అగ్రస్థానంలో ఉన్నాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బౌలింగ్‌లో రేణుకా ఠాకూర్ 4 వికెట్లు, దీప్తి శర్మ 3 వికెట్లతో చెలరేగడంతో శ్రీలంకను భారత్ తక్కువ స్కోర్‌కే కట్టడి చేసింది. అనంతరం ఛేదనలో షఫాలీ వర్మ కేవలం 42 బంతుల్లోనే 79 పరుగులు చేసి అజేయంగా నిలవడంతో, భారత్ 40 బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా గెలిచింది. ఈ విజయంతో భారత్ సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంది.

హర్మన్‌ప్రీత్ ఇప్పటివరకు 130 టీ20 మ్యాచ్‌లకు కెప్టెన్సీ వహించింది. ఇది కూడా ఒక రికార్డే. అలాగే, మహిళల టీ20 చరిత్రలో అత్యధికంగా 185 మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా కూడా ఆమె నిలిచింది. రెండు నెలల క్రితం భారత్‌కు తొలిసారి వన్డే ప్రపంచకప్ అందించిన హర్మన్‌ప్రీత్, ఇప్పుడు టీ20 ఫార్మాట్‌లో ఈ రికార్డును నెలకొల్పడం గమనార్హం.

# సహనా..సహనా సాంగ్ కొత్తగా చూపారు

## రాజాసాబ్ సాంగ్‌పై నిధి అగర్వాల్




టాకీస్: ప్రభాస్‌తో కలిసి 'ది రాజాసాబ్' అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు.రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి.

రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేనని నిధి చెప్పారు. ఇకపోతే రాజాసాబ్‌లో ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌లపై నిల్చున్నా. సహనా సహనా సాంగ్‌ను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెర పైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్‌లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటి నుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ కూడా చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం నాకు ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగ్‌కు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్ వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను అని వెల్లడించారు.




## సంక్రాంతికి సందడి
# చేయనున్న చిరు, వెంకీ
### ఆర్ యూ రెడీ సాంగ్ ప్రోమో విడుదల



**టాకీస్:** 'ఆర్ యూ రెడీ' అంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు అగ్రకథానాయకులు చిరంజీవి, వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటిస్తోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. వెంకటేశ్ అతిథిపాత్రలో సందడి చేయనున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'ఆర్ యూ రెడీ' అంటూ సాగే పాట ప్రోమోను తాజాగా విడుదల చేశారు. ఈ పూర్తిపాట డిసెంబర్ 30న రానుంది. అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి స్టెప్పేస్తే.. థియేటర్లలో ప్రేక్షకుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడా అపురూప ఘట్టాన్ని 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో తెరపై చూపించనున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి - నయనతార జంటగా నటించిన ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఇందులో చిరు - వెంకీ కలయికలో ఓ పాట తెరకెక్కించినట్లు ఇప్పటికే తెలిపారు. ఇప్పుడా 'మెగా విక్టరీ మాస్ గీతం'ను ఈనెల 30న బయటకు వదలనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అందులో చిరంజీవి, వెంకటేశ్ స్టైలిష్ లుక్స్‌లో.. హుషారుగా స్టెప్పేస్తూ కనిపించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

## ఛాంపియన్ ప్రతి ఒక్కరూ
# మెచ్చే సినిమా




టాకీస్: కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా 'ఛాంపియన్ అన్నారు హీరో రోషన్. ఈ చిత్రం యదార్థగాథలకు ప్రతిరూపం అన్నారు. రోషన్,. అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. స్వప్న దత్, జీకే మోహన్, జెమినీ కిరణ్ నిర్మించారు. నందమూరి కల్యాణ్ చక్రవర్తి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. 'ఛాంపియన్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా అన్నారు హీరో రోషన్. 'ఇది పిల్లలతో కలిసి చూడాల్సిన చిత్రం. ఇది ప్రతి ఒక్కరికీ నచ్చింది' అన్నారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. ఈ కార్యక్రమంలో నందమూరి కల్యాణ్ చక్రవర్తి, స్వప్న దత్, జెమినీ కిరణ్, జీకే మోహన్, అనస్వర రాజన్, మిక్కీ జే మేయర్, రచ్చ రవి, సంజయ్ బలగం, యశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'పతంగ్' సినిమాపై సందీప్ కిషన్
# బంపర్ ఆఫర్..

**టాకీస్:** టాలీవుడ్ యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో సందీప్ కిషన్ మరోసారి తన ఉదారతను చాటుకున్నాడు. టాలీవుడ్‌లో చిన్న సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ అందుకున్న 'పతంగ్' చిత్రంపై భారీ ఆఫర్‌ను ప్రకటించాడు. ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న 'పతంగ్' చిత్రాన్ని మరింత మంది ప్రేక్షకులకు చేరువ చేసేందుకు సందీప్ కిషన్ ఏకంగా 500 సినిమా టికెట్లను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ అనూహ్య నిర్ణయంతో సామాన్య ప్రేక్షకులు సైతం థియేటర్లకు వెళ్లి సినిమాను ఎంజాయ్ చేసే అవకాశం కలిగింది. సినిమా పట్ల సందీప్ చూపిస్తున్న ఈ ప్యాషన్ పట్ల నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



మరోవైపు సినిమా వినోదంతో పాటు, కడుపునిండా భోజనం చేసేందుకు కూడా సందీప్ అదిరిపోయే ప్లాన్ చేశారు. 'పతంగ్' సినిమా టికెట్ చూపించిన వారికి తెలుగు రాష్ట్రాల్లోని అతడి ప్రసిద్ధ 'వివాహ భోజనంబు' రెస్టారెంట్లలో బిల్లుపై 20 శాతం ఫ్లాట్ డిస్కౌంట్ లభించనున్నట్లు తెలిపాడు. సినిమా చూసిన ప్రేక్షకులు ఫిజికల్ టికెట్ లేదా ఆన్‌లైన్ బుకింగ్ స్క్రీన్ షాట్ చూపిస్తే చాలు. హైదరాబాద్ పాతబస్తీ సంస్కృతిని, గాలిపటాల పండుగ నేపథ్యంలో సాగే భావోద్వేగాలను ఈ చిత్రం అద్భుతంగా ఆవిష్కరించింది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా ఈ సినిమా అలరిస్తోంది. మరోవైపు ఆది నటించిన శంబాల సినిమా చూసిన ప్రేక్షకులు కూడా 'వివాహ భోజనంబు' రెస్టారెంట్లలో భోజనం చేస్తే వారికి 20 శాతం ఫ్లాట్ డిస్కౌంట్ లభించనున్నట్లు సందీప్ తెలిపాడు.

## సల్మాన్ ఖాన్ 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్'
# టీజర్ విడుదల

టాకీస్: బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ తన 60వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్' నుంచి తాజాగా టీజర్‌ను నేడు విడుదల చేశారు. ఈ టీజర్‌లో సల్మాన్ ఖాన్ మునుపెన్నడూ లేని విధంగా ఒక సీరియస్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. గల్వాన్ లోయ ఘర్షణల నేపథ్యంలో సాగే ఈ కథలో ఆయన నటన చాలా ఇంటెన్సివ్‌గా ఉంది. 2020లో భారత్-చైనా సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్, గల్వాన్ పోరాటంలో అసువులు బాసిన తెలంగాణ ముద్దుబిడ్డ కల్నల్ సంతోష్ బాబు పాత్రలో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది (అయితే దీనిపై పూర్తి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది). టీజర్‌లో 'చావుకి భయం ఎందుకు.. అది ఎలాగైనా వస్తుంది' అనే డైలాగు అభిమానుల్లో పూనకాలు తెప్పిస్తుంది.




ఈ సినిమాకు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తుండగా.. సల్మాన్ ఖాన్ సరసన చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తోంది. హిమేష్ రేషమియా సంగీతం అందించబోతున్నాడు. ఈ చిత్రం ఏప్రిల్ 17, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.